కథ

# ప్లీజ్... వద్దు

-రహమతుల్లా

పిపిపిపిపిప్.....పిపిపిపిపిపిప్......పిపిపిపిపిపిప్...

ఎక్కడో పాతాళం నుంచీ వినిపిస్తున్న అలారం శబ్దం. చాలా సేపటి నుంచే మోగుతున్నట్లుంది. శరీరానికీ,మనస్సుకీ సరిపోయినంత నిద్రలభించ నందున, లేవటానికి అవి సహకరించటం లేదు. కానీ, ఇప్పుడు లేవకుంటే సమయానికి పనులు తెమిలి చావవు.

తప్పక భారంగా కళ్ళు తెరిచి అలారం ఆపాను. అలారం పెట్టుకోకుంటే ఉదయం నాలుగు గంటలకే లేవటం నావల్ల కాని పని. ఏ ఎనిమిదింటికో లేస్తాను. అందుకే ఎంత విసుగ్గావుగా అనిపిస్తున్నా, బడలిక తీరక మూలు గుతున్న శరీరాన్ని బలవంతాన పక్కమీద నుంచీ లేపి బాత్‌రూమ్‌లోకి తీసుకు పోయాను.

దోసిలితో ఇన్ని చల్లటి నీళ్ళు ముఖంమీద చల్లుకు న్నాను. సగం మత్తు వదిలింది. అంత ఉదయాన్నే పాలు రావు కనుక బ్లాక్‌టీ చేసుకు తాగాను. పూర్తి మత్తు వదిలింది.

అబ్బ!ఎంత ఫ్రెష్‌గా ఉందో. రాత్రి పడుకుం టున్నప్పుడయితే ఎవరో శరీరాన్ని కుళ్ళపొడిచినట్లు శరీరం అంతా పచ్చి పుండులా ఉండింది. ఇప్పుడు స్వర్గంలో విహరిస్తున్నట్లుంది.

ఈ సుఖం ఇలా శాశ్వితంగా సాగిపోతే ఎంత బావుణ్ణు!

వర్కింగ్ వైఫ్‌కుఅంత అదృష్టమా?

మూల నున్న చీపురు కట్ట అందుకుని,ఈరో జుటి నా పనుల పరుగు మొదలు పెట్టాను. ఇల్లూ, వాకిలీ వూడ్చుకుని, కల్లాపి చల్లి, ముగ్గేసి, కాల కృత్యాలు తీర్చుకుని, స్నానంచేసి, దేవుడికి హారతి ఇచ్చి, కూతుళ్లను, శ్రీవారినీ లేపటానికి వచ్చే సరికి ఏడయిపోయింది. వాళ్ళకు సుప్రభాతం పాడి, లేపి, చేతుల్లో బ్రష్‌లు పెట్టి వంటగదిలోకి పరుగుతీశాను.

ఇక చూడండి– తొమ్మిదింటి వరకూ మాఇంట్లో ఒకటే చిరుపెట్టెలాట. మూడో తరగతి చదివే పెద్దది స్నానాల గదిలో దూరితే ఒకటో తరగతి వెలగబెట్టే చిన్నది లెట్రిన్‌లోకి పోతుంది. శ్రీవారు సావుబస్తాల్లాంటి పిల్లల స్కూలు బ్యాగులు సర్దు తుంటారు. నేనేమో వంట కానిస్తూనే, వాళ్ళకు స్నానాలు చేయించటం, విడిచిన బట్టలు ఉతకటం, స్కూలుకుతయారు చేయటం లాటి పనులు కల గలిపి చేస్తుంటాను. నాకు సహాయంగా కూరగా యలు తరగటం, నీళ్ళుపట్టటం లాటివి మావారు చేస్తుంటారు.

"డాడీ!సాక్స్‌తొడుక్కున్నా, లేసులు ముడేయటం రావటంలేదు. త్వరగా రా"బుడిబుడి మాటలు కూడగట్టుకుంటూ చిన్న కూతురు పిలిచింది. స్నానానికి పోయే మనిషి గోడ గడియారం వైపు ఒకసారి చూసి "వచ్చే..వచ్చే.."అంటూ అటు పరు కుతూ "అరుణా! బాక్సులు సర్దినావా? టైమవు తోంది. నిన్ననే లేటయింది. బడిలో ప్రార్థన అయ్యేంత వరకూ గేటు బయటే నిలబడ్డాం. నాబస్సు కూడా మిస్సయింది. నేనూలేటే. త్వరగా కానివ్వు. ఇంతకీ టిఫెన్ రెడీనా?" శ్రీవారు కేకేశారు.

"తెస్తున్నా...తెస్తున్నా..."అంటూ అప్పుడే తీసిన వేడి వేడి ఇడ్లీలు తెచ్చి అందరికీ తినిపించ సాగాను. కాలుతున్నా, ఎలాగోలా మింగుతూ ఎవరి పనులు వాళ్ళు ఆదరా బాదరా చేసుకుంటున్నారు.

కిందా మీదా పడి ఎవరి పనులు వాళ్ళు తెముల్చుకుని, వాళ్ళు ముగ్గురూ బయట పడి స్కూటరుతీసే సరికి తొమ్మిది కానే అయింది. శ్రీవారి రెండుభుజాలకు, రెండు పుస్తక బస్తాలు వేలాడుతుండగా, చిన్నది ముందర నిలబడింది. పెద్దది వెనక కూర్చుంది. స్కూటరు మీద సామానులు చేరవేసే కూలీమాదిరి ఉన్నారు మా శ్రీవారు.అయినా ఇంతింత చిన్న పిల్లలకు అన్నన్ని పుస్తకాలెందుకో,నాకిప్పటికీ అర్థమై చావదు.

"మమ్మీ..టాటా..."పిల్లలు చేతులూపుతుండగా స్కూటరు కదిలింది.

"ఏమండీ!జాగ్రత్త. లేటయినా పరవాలేదు. నిదా నంగా పక్కనుంచీ పోండి" అరిచాను. నామాటలు అతని చెవులకు చేరక ముందే బండి ముందుకు రివ్వున దూసుకు పోయింది.

బజార్ల మీద స్కూలు టైము రద్దీ... మదిలో మెదలగా శరీరంలో వణుకు పుట్టింది. కానీ భయాల గురించి బెంగ పడుతూ కూర్చోటా నికి సమయ మెక్కడుందీ? కొద్ది నిముషాలు కూర్చున్నానా...అంతే ఏమీ తినకుండానే ఆఫీసుకు ఉరకాల్సి వస్తుంది. అందుకే కాబోలు ఈవర్కింగ్ ఉమెన్ కన్నా గానుగెద్దు బెటర్ అనిపిస్తుంది. ఒక యంత్రంలా గుండ్రంగా దినమంతా తిరుగుతూ ఉన్నప్పటికీ దానికి ఆహారవు రుచిని నెమరువేసుకునే అదృష్టమూ, ఆలోచించుకునే నెమ్మదీ ఉన్నాయి. 'ఛీ! ఏంబతుకో...? పశువుల కన్నా హీనం అయిపోయింది 'అని మనసులో అనిపించింది.

ఏమిటో!ఈమధ్య కొంచెం ఖాళీ దొరికితే చాలు–' ఒకటే హద్దూపద్దూలేని ఆలోచనలు వస్తూ, అసం తృప్తిని కల్గిస్తున్నాయి. కానీ ఏం చేయగలము? బాధ కలిగినంత మాత్రాన ఆఫీసుకు పోకుండా ఉండలేను కదా! అలా ఉండగలిగితే ప్రతిరోజు ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. అందుకే మేకప్ అయిందనిపించి, ఏదో రెండు ఇడ్లీలు తిన్నానంటే తిన్నాననిపించి, లైట్లుఫాన్‌లు ఆఫ్ చేసి,కిటికీలు మూసి, ఇంటికి తాళం వేసి బైటపడే సరికి పది దాటనే దాటింది.

ఇప్పటిక బయటి నరకం మొదలు. రోజూ మాదిరే ఎదురుగా అమ్మలక్కల దర్శనం. మావాడలోని గృహలక్ష్ములమ్మచూస్తేఅసూయతో పాటు నాకెంత వళ్ళుమంటో! నిత్యం సరిగ్గా పదిగంటలకు మాఎదురింటి గడపను వేదికగా చేసుకుంటారు. సాయంత్రం వరకూ ఒకటే కబుర్లు...చాడీలు..చీరల ముచ్చట్లు..మధ్యమధ్యలో పోయి టీవీ కార్యక్ర మాలు చూసి తిరిగి చర్చల్లో చేరుతుంటారు.

భర్తలను పనుల్లోకి పంపించి తాపీగా ఇంటి పనులు చేసుకోవచ్చు. కానీ అలా చేయరు. పై ఆఫీసరు ఉన్నప్పుడు మేము చేసినట్లుగా, భర్తలున్నప్పుడే అన్ని పనులు వేగంగా పూర్తి చేసి పడేసి ఇవతల పడ్తారు. మొగుళ్ళ దృష్టిలో విప రీతంగా శ్రమిస్తున్నట్లు కన్పించి, వారి విశ్వాసాన్ని పొందాలనే మరి. పరాన్న జీవులు కద. ఆ మాత్రం భయం లేకుండా ఎలా వుంటుంది లెండి. వాళ్లు భర్తల దగ్గర ఎంత బాగా నటించుకుంటే, నాకేమి గాని, నాఫర్యాదల్లా బయటి ప్రపంచంలో అడుగిడిన నాలాంటి వారి గురించి వారి విసుర్లు మాత్రమే–



"అబ్బో ఈవిడకు ఉద్యోగము చేస్తున్నాననే టెంప రెక్కువలే"

ఎప్పుడు చూడు, ఇంట్లోనే ఉంటది. ఏంటొదినా బయటకు రావు అంటే, పనులంటది. మనకు తెలియదనుకుంటది, తలుపులన్నీ మూసి భర్తచేత ఆడంగిపనులు కూడ చేయిస్తదని."

చూశారా... చూశారా... ఎంతటి అవగాహనా రాహిత్యంతో కూడుకున్న మాటలో... పనుల్లో ఆడంగిపనులేంది, మగంగి పనులేంది? మేము పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేయటంలా?

అందుకే వాళ్లవైపు కూడా చూడకుండా వడివడిగా వెళ్లిపోతుంటాము. కొంచెం దూరం నడవగానే ఇంకో పనికిమాలిన పోకిరి గుంపు కనిపిస్తది. వాళ్లయితే వయసులో తమ్ముళ్ల మాదిరో, కొడుకుల మాదిరో కనిపిస్తారు. కానీ జంతు లక్షణాలెక్కువ. చూడండి మీకే తెలుస్తుంది.

"భౌ...భౌ..."

'అరవకు పిచ్చా! అంటే నిజంగానే కుక్కముఖుని



## రేటు పెంచిన సోనాలి బింద్రే

అసలు ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ హిట్టులేని సోనాలి బింద్రే ప్రతి సినిమాకీ రేటు మాత్రం పెంచేస్తోంది. అదేమంటే తాను నటించేవన్నీ పెద్ద పెద్ద బ్యానర్లలోనే నట. అందుకని కంతనుషోరీ తీస్తున్న 'జధ్' లో నటించడానికి కూడా నొప్పకున్న దానికంటే ఎక్కువడిగే సరికి ఆ పాత్రలో సోనాలీని తప్పించి టాబూని పెట్టుకున్నారట.

ఊరికినా ఉరుకుద్ది."

వెనకనుంచి జులాయి వెధవల బనాయింపు మాటలు. అందుకే ఈ అడ్డాకు రాగానే కాళ్లల్లో వణుకుడు, గుండెల్లో దడదడ మొదలవుతుంది. పైగా దారిన పోయే స్త్రీలను కుక్కల్లా పొంగ కార్చుకుంటూ, పై నుంచి కింది దాకా ఒకటే ఇదిగా చూస్తుంటారు, అసలు స్త్రీలనే ఇంతకు ముందు చూడనట్లు అంత ఛండాలంగా చూస్తుంటే, స్వేచ్ఛగా ఎట్లా నడవగలం చెప్పండి? మనసు అల్లకల్లోలానికి గురికాకుండా ఎలా ఉంటుంది?

మా ప్రాణానికి ఇవి సరిపోనన్నట్లు, కిక్కిరిసిన లోకల్ బస్సు ప్రయాణ ఇంకోటి. కండక్టరు దగ్గర, మంచి ముసలి డొక్కు వరకు ప్రతివెధవ ఎక్కడ పడితే అక్కడ తడిమేవాడే. ఇవన్నీ ఎలాగోలా దాటి ఆఫీసులో అడుగుపెట్టేసరికి కొంతమేర అలసిపోయి ఉంటాం. ఇక్కడన్నా హాయిగా ఉండదా, అంటే అదీలేదు. అందుకే నా బతుకు ఫుట్‌బాల్ లాంటిదని నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది.

ఉదయమంతా అదుకుని ఇల్లు ఒక్క తన్ను తంతే ఆఫీసులో పడతాము. సాయంత్రం వరకు ఆడుకుని ఆఫీసు ఇంకో తన్ను తంతే ఇంట్లో కొచ్చి పడతాము.

మా సగం జీవితం ఆఫీసుల్లో నే గడిచిపోతుంది. ఉన్న నందమందిని కలిసిమెలిసి ఆత్మీయంగా ఉంటే ఎంత ఆనందంగా ఉంటుంది. కానీ ఈ రోజుల్లో సామూహిక జీవనం ఎక్కడ ఉంది వచ్చింది కనుక, ఆఫీసుల్లో ఉండటానికి.

వాటికి తోడు ఆఫీసునని ఒకటి. పూర్తి యాంత్రికత. క్రియేటివిటీకి అవకాశమే ఉండదు. చదివిన చదువుకు చేస్తున్న పనికి సంబంధమే ఉండదు. ఇటువంటి సంక్లిష్ట వాతావరణంతో పని చేస్తున్న మాకు తృప్తి, ప్రశాంతత ఎక్కడినుంచి లభిస్తాయి? అవి లేని జీతం రాళ్లయితే నదులు కోలేం కదా?

సాయంత్రం అవుతుంటే తిరిగి రక్త ప్రసరణ వేగం పెరుగుతుంది. ఆఫీసునుంచి బయటపడి నిస్సారంగా లోకల్ బస్టాపునకు నడుస్తున్నాను. ఆ సమయంలో బజార్లు ఎంత రద్దీగా ఉంటాయో! ఆ వాహనాల వరదలో రోడ్డుకు అటువైపు పోవాలన్నా బ్రహ్మ ప్రళయమే. చెవులు చిల్లులు పడేలా గొడ్లు సైతం అదిరే హారన్ మోతలు చేసుకుంటూ రాకెట్లకన్నా వేగంగా దూసుకుపోయే మోటార్లు. 'అమ్మా' అన్న చావుకేక. సీలి సీలి గౌనుల్లో ఉన్న ఇద్దరు చిన్నారులు గాల్లో అంతెత్తున ఎగిరి కింద పడ్డారు. మా పిల్లల వయస్సున్న అపాపలు క్షణాల్లో అచేతనులయ్యారు. ఆటో,స్కూటరు గుద్దుకున్నాయి. అక్కడి రక్తపుమడుగుతో మనస్సంతా కకావికలమైపోయింది. స్కూలుకు పోయి పిల్లల్ని తీసుకుని, ఎప్పుడు ఇంట్లో పడ్డానో నాకే తెలియదు.

మనస్సులో నుంచి ఆ ప్రమాద దృశ్యం తొలగి, నేను తేరుకునే సరికి చీకటి పడింది. పిల్లల చేత హోమ్‌వర్కు చేయిస్తూ, వంటా వార్పు కానిస్తున్నాను. మానసికంగా, శారీరకంగా బాగా అలసిపోయిన స్థితిలో పిల్లలకు చదువు చెప్పడం కన్నా, నరకంలో శిక్షననుభవించడం తేలిక- వాళ్ల చిన్న చిన్న బుర్రలకు పెద్ద పెద్ద విషయాల్ని అర్థం చేయించటమంటే మామూలు మాట కాదు.

అయినా నాకు నిత్యం తప్పని శిక్షది. కాలింగ్ బెల్ సవ్వడి వినిపించే సరికి, 'నాన్నొచ్చినట్లున్నాడు తలుపు తీయండి' అన్నాను. అప్పటికే పుస్తకాలు మూసేసి టీవీకి అంకితమైపోయారు పిల్లలు. 'ఆడపిల్లలనే కాని ఒక్కనికి ఆశలేదు.' అనుకుంటూ తాలింపు మాడకుండా స్టవ్ సిమ్‌లో పెట్టి, గంటె చేతిలో పట్టుకునే పరుగెత్తుకుంటూ పోయి, గడియతీసి, పరుగెత్తుకుంటూనే తిరిగి వచ్చేశాను. ఎవరొచ్చారో కూడా చూడలేదు. చూడండి! ఎంత హడావిడి బతుకో.

'చిన్న దేది? ' బెడమీద వెల్లకిలా పడుకుంటూ అడిగారు లోనికొచ్చిన శ్రీవారు. బాగా అలసిపోయి నట్లున్నారు. "నాన్నా! మంచం కింద... మంచం కింద... నీతో దొంగాట ఆడుతోంది" గుసగుసగా పెద్దకూతురు సైగలు చేస్తూ అంది. 'బయటకు రమ్మను. మా మొఖాలకు ఆటలొక్కటే తక్కువ. మీ కోసం సంపాదించే డబ్బుల ఆటతోనే మా నడుములు కాస్తా విరుగుతున్నాయి' కసురుకున్నారు. స్కూటరు ప్రయాణం... లోకల్ బస్సు ప్రయాణం... అడ్డరోడ్డు నుంచి నడక... టీచరు నౌకరి... ఎక్స్ట్రాగా రాత్రి ట్యుటోరియల్స్... ఇన్ని చేసి వచ్చాక ఓపిక ఎక్కడినుంచి వచ్చి ఛస్తుంది. అందరికీ భోజనాలు వడ్డించి, పక్కలు వేసి, అంట్లుతోమి, స్నానం చేసి, పక్కచేరే సరికి ఎప్పటిలానే పదకొండు దాటింది. నీవు పరుపుకు ఆనించావో లేదో నిద్రాదేవి క్షణాల్లోనే తనలోకి లాగేసుకుంది. ప్రాణమెటుపోయిందో! శవంలా నిర్జీవినై పోయాను.

"అరుణా! నువ్వెంత గింజుకున్నా ఈ రోజు ఊరుకునేది లేదు. అవసరమైతే రేప్ అయినా చేస్తాను." పులిలా నామీదకు దూకుతూ మావారు...

"వద్దు ప్లీజ్... వద్దు... నన్ను హింసించొద్దు... అసలే చాతనైతలేదు... ఇప్పుడు నా వల్ల కానే కాదు" లేడిలా వారిని తప్పించుకుంటూ అరుస్తున్నాను.

'అరుణా!అరుణా!' శ్రీవారు తట్టిలేపారు. కళ్లు తెరచిన నాకు సాధు జంతువు మాదిరి నా కళ్లలోకి చూస్తూ వారు కన్పించారు.

'అరె! అది కలా!' అని నా కొచ్చిన స్వప్నం ఆయనకు వినిపించాను.

ఆయనగారు నిర్లిప్తంగా ఒక నవ్వు నవ్వి 'డోంట్ వర్రీ మైడియర్. నీ పరిస్థితీ నా పరిస్థితీ ఒక్కటే. ప్రస్తుతం రంభొచ్చినా నమస్తే అనాల్సిందే. మనం ఏక శయన విరాగులం. తెల్సిందా?' అని అటువైపు తిరిగి నీరసంగా పడుకున్నారు.

మా సమాగమాన్ని 'అప్పరేవు' లా 'శివరాత్రికి' అని ఎప్పటిలా మనసులో మరో వాయిదా వేసుకొని నేను కూడా ఇటువైపు తిరిగి పడుకున్నా.

మా వీపులు మాత్రం కలుసుకుని బాధగా నవ్వుకున్నాయి.